క్లుప్తంగా

రేషన్ షాపు తనిఖీ



బియ్యం పరిశీలిస్తున్న తహసీల్దార్ విశ్వంభర్

భీమారం: మండల కేంద్రంలోని రేషన్ షాపును ఆదివారం తహసీల్దార్ విశ్వంభర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సంక్రాంతిని పురస్కరించుకొని సెలవు రోజుల్లో కూడా పంపిణీ చేయాలని డీలర్‌ను ఆదేశించారు. ప్రతి కార్డు దారుడికి సక్రమంగా బియ్యం అందించాలన్నారు. బియ్యంలో నాణ్యత లోపిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

నస్పూర్: మంచిర్యాల పట్టణ రెడ్డి సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ఆవిష్కరించారు. నస్పూర్‌లోని ఏఎస్‌ఆర్ ఫంక్షన్‌హాల్లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పాల్గొని క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెడ్డి కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు చెఱుకు మధుసూదన్‌రెడ్డి, అధ్యక్షుడు పానుగంటి శ్యాంసుందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అయిలేని రవీందర్‌రెడ్డి, కోశాధికారి చందుపట్ల చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు మనోహర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, తిరుమల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆదివాసీలు

జన్నారం: మండలంలోని హస్టల్ తండా, లోత్రై గిరిజన గ్రామాలకు చెందిన ఆదివాసీలు ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు నివాసానికి వెళ్లి శాలువాతో సన్మానించి, పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. కవ్వాల్ నుంచి పోచమ్మ ఆలయం వరకు రోడ్డు నిర్మాణం, మురిమడుగులోని జొర్రమ్మ ఆలయం వరకు రోడ్డుతో పాటు నీటి సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆదివాసీ గూడేల్లో రోడ్లు, నీటి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జు స్పందిస్తూ.. ఆదివాసీ గూడేలా సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చినట్లు తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు కాశీ తెలిపారు. కార్యక్రమంలో మల్యాల సర్పంచ్ హన్మంత రావు, ఆదివాసీ సంఘం సభ్యులు వసంత్, సోనే రావు, జంగుపటేల్, బొజ్జు పటేల్, మాణిక్, జైతు, లక్ష్మణ్, మారు తదితరులు పాల్గొన్నారు.

పతంగుల పోటీలు

మందమర్రిరూరల్: పట్టణంలోని మార్కెట్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో గుడికందుల రమేష్, శేఖర్, అనిల్ అనే యువకులు పతంగుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు సుమారు 50మంది ఉత్సాహంగా పాల్గొనగా వారికి పతంగులు అందించారు. ఎక్కువ పతంగులు కట్ చేసిన అనిల్‌కు ప్రోత్సాహకంగా రూ.వేయి నగదు అందించారు.

బోయపల్లిలో క్రికెట్ పోటీలు

తాండూర్: మండలంలోని బోయపల్లిలో ఆదివారం క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. మాసాడి విష్ణువర్ధన్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను ఎంపీటీసీ, శ్రీ బుగ్గ రాజరాజేశ్వరస్వామి దేవాలయం చైర్మన్ మాసాడి శ్రీదేవి, ఉపసర్పంచ్ రౌతు వెంకటేశం ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. యువకులు క్రీడా స్ఫూర్తితో క్రికెట్ ఆడి రాణించాలని వక్తలు అన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ మాసాడి తిరుపతి, నాయకులు మాసాడి నారాయణ, శశివర్ధన్, కీర్తివర్ధన్, రవి, యువకులు, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఐక్యంగా హక్కులు సాధించుకోవాలి



కాసిపేట: మున్నూరుకాపులు సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలని సంఘం జిల్లా అధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ కోరారు. కాసిపేటలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి హాజరై మాట్లాడారు. ప్రజాప్రతినిధులు మున్నూరు కాపులు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అనంతరం మున్నూరుకాపు సంఘం 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంఘం మండల అధ్యక్షుడు అగ్గి సత్తయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మిట్ట లచ్చన్న, నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డు నారాయణ, మండల ప్రధాన కార్యదర్శి కొమ్ము సతీశ్, నాయకులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

- వైభవంగా గోదారంగనాథుల కల్యాణం
- పాల్గొన్న భక్తజనం



చెన్నూర్ జగన్నాథాలయంలో కల్యాణం

చెన్నూర్: పట్టణంలోని జగన్నాథాలయంలో గోదా రంగనాయకుల కల్యాణం జగన్నాథాలయం వంశపారంపర్య అర్చకులు దామెర మోహనాచార్యుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. గోదాదేవి కల్యాణ మహోత్సవంలో వైద్యులు అరుణశ్రీ శ్రీనివాస్ దంపతులు కూర్చున్నారు. కార్యక్రమంలో అర్చకులు అనిల్‌చార్యులు, అజయ్ చార్యులు, ధర్మకర్త మండలి సభ్యులు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, నడిపల్లి లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): శ్రీ త్రిదండి రామచంద్రరామానుజ జీయర్‌స్వామి దివ్య మంగళా శాసనములతో ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా గోదారంగనాథుల కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. హాజీపూర్ మండలంలోని గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ ఎదుట గల గోవింద క్షేత్రంలో వైభవంగా జరిపారు. బెటాలియన్ ఆధ్వర్యంలో కల్యాణం సందర్భంగా పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. భద్రాచాలం నుంచి ప్రత్యేకంగా విచ్చేసిన వేదపండితులు చక్రధరాచార్యులు, విజయ్‌కుమారాచార్యులు, అర్చకుడు నర్సింహాచారి ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణల మధ్య కల్యాణ దాతల సహకారంతో దేదీప్యమానంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం ఏర్పాటు చేసిన తదియారాధన(అన్న ప్రసాదం) ప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు.

భీమారం: స్థానిక శ్రీ కోదండరామాలయంలో గోధా రంగనాయకుల కల్యాణం అర్చకులు ఘనంగా జరిపించారు. చెన్నూరు ఎమ్మెల్యే కుమారుడు వంశీకృష్ణ, ఆలయకమిటీ అధ్యక్షుడు చేకూర్తి సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ సరోజన, తహసీల్దార్ విశ్వంబర్ పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు.



పాల్గొన్న జీఎం సంజీవరెడ్డి, రాధాకుమారి



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

నస్పూర్: పట్టణ పరిధిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో శ్రీ గోదాదేవి -రంగనాథస్వామిల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి రాధాకుమారి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణ మహోత్సవం సందర్భంగా అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముల వారి తలంబ్రాలు గోదా అమ్మ వారి తలంబ్రాలు కలిపి భక్తులకు పంపిణీ చేశారు. కోలాటాల నృత్యంతో గుడి చుట్టూ మాడవీధులగుండా పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సముద్రాల లక్ష్మణాచార్యులు, వెంకటరమణ, నరేశ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాసులు, సభ్యులు మల్లిఖార్జున్‌రావు, సూరపనేని శ్రీనివాస్, విష్ణువర్ధన్‌రెడ్డి, వేణు, తరంగిణీ సభ్యులు భాగ్యలక్ష్మి, భాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



కల్యాణం జరిపిస్తున్న పండితులు

జైపూర్: స్థానిక భూనీల సమేతా శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం వేద పండితులు కృష్ణమాచార్యుల నేతృత్వంలో గోదాదేవి-రంగనాథుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రజలకు శాంతిసౌభాగ్యం కలగాలని, ప్రజల్లో సుఖశాంతులు నెలకొనాలని, సంవృద్ధిగా పంటలు పండాలని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ ప్రధానకర్త బల్మూరి ఉష, సర్పంచ్ ఆసంపల్లి సువర్ణ, ఎంపీటీసీ లింగస్వామి పాల్గొన్నారు.



రామకృష్ణాపూర్: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో గోదా రంగనాథుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. సూపర్ బజార్ నుంచి ఎదుర్కోలు నిర్వహించారు. మహిళలు కోలాటా లు ఆడుతూ సందడి చేశారు. కార్యక్రమంలో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ తనయుడు గడ్డం వంశీ, నాయకులు రఘునాథ్‌రెడ్డి, పల్లెరాజు, మహంకాళి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధి సుభాష్‌నగర్ బస్తీలో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ గోదా రంగ నాయకుల స్వామి కల్యాణోత్సవం వేద పండితులు చిమిరాల దామోదర చార్యులు, శ్రీనివాసాచార్యులు మంత్రోచ్చరణల మధ్య కనుల పండువగా సాగింది. ఘట్టాన్నీ భక్తులు నేత్రానందంగా తిలకించి పులకించి పోయారు. అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు రామకృష్ణాచార్యులు, ఆలయ చైర్మన్ ఆసం ఏడుకొండలు, వైస్ చైర్మన్ రొంటాల గంగారాం, యూత్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో...



దండేపల్లి: జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన దండేపల్లి మండలం గూడెం శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో గోదా రంగనాధుల స్వామి కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. సత్యనారాయణస్వామి ఆలయం తరుపున స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ప్రధాన అర్చకులు రఘుస్వామి, వేదపండితులు నారాయణశర్మ, అర్చకులు సంపత్‌కుమార స్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

చదరంగం పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బహుమతులతో విద్యార్థులు

తాండూర్: మండలంలోని రేపల్లేవాడలోని హనుమాన్ దేవాలయంలో ఆదివారం ఓపెన్ టు ఆల్ చదరంగం పోటీలు నిర్వహించారు. పోటీలకు తాండూర్ మండల ఫొటోగ్రాఫిక్ యూనియన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, అంతర్జాతీయ క్రీడాకారుడు ఆకాష్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదరంగం పోటీల వల్ల మేధస్సు చురుకుగా పనిచేస్తుందన్నారు. పోటీల్లో పాల్గొన్న ప్రతిఒక్కరూ ఆటలో రాణించాలని ఆకాంక్షించారు. పోటాపోటీగా జరిగిన ఈ పోటీల్లో భువన్ రుషి((ప్రథమ), ఆకుల అజయ్(ద్వితీయ), మహేష్ (తృతీయ)బహుమతిని గెలుచుకున్నారు. విజేతలకు, పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి విశ్వనాథ్, నిర్వాహకులు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో కుమార్ బ్రదర్స్ అకాడమీ చైర్మన్ ఐ.సమ్మయ్య, రేపల్లెవాడ అధ్యక్షుడు ఆకుల తిరుపతి, ఆకుల రామకృష్ణ, విజయ్ బడ్ల్ బ్యాంకు ఉపాధ్యక్షుడు మామిడి విఘ్నేష్, కోచ్ మహేష్, తాండూర్ మండల చెస్‌కోచ్ ఆర్.సుధాకర్, హీరాలాల్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నెన్నెల: మండలంలోని చిత్తాపూర్‌కు చెందిన ఈగం భూమక్క-భీమయ్య అనే నిరుపేద గిరిజన దంపతుల కుమారుడు ఈగం కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాళ్లు, వెన్నెముక విరిగింది. కాగా ఈ నిరుపేద యువకుడి కుటుంబానికి ఆదివారం ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ రూ.10వేలు చికిత్స కోసం ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఆ ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు భూమేష్, కోశాధికారి సురేష్, సభ్యులు మహేందర్, అశోక్ పాల్గొన్నారు.

ఘనంగా భోగి వేడుకలు

జన్నారం/కాసిపేట/చెన్నూర్‌రూరల్/మంచిర్యాల టౌన్/బెల్లంపల్లి/మంచిర్యాలరూరల్(హాజీపూర్): సంక్రాంతిని పురస్కరించుకోని భోగి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామునే భోగి సంబరాలు ఆరంభమయ్యాయి. చలితీవ్రత నుంచి ఉపశమనం పొందడానికి ప్రజలు భోగి మంటలు కాగారు. ఇంటి ముందు మహిళలు పేడతో కళ్లాపి చల్లి రంగురంగులతో అందమైన ముగ్గులు వేశారు. ముగ్గు మధ్యలో పేడతో చేసిన గొబ్బెమ్మను పెట్టి నవధాన్యాలు, గరకపోచలు, రేగుపండ్లు, చిక్కుడు కాయలు ఉంచారు. ఇంటి లోగిళ్లలో రంగవల్లులు కనువిందు చేసి ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఎటు చూసినా సంక్రాంతి శోభ ప్రస్ఫుటంగా కనిపించింది. సంప్రదాయం ప్రకారం ఇళ్లలో చిన్నారులకు భోగి పండ్లు పోస్తూ, ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు, యువకులు ఉత్సాహంగా గాలిపటాలు ఎగురవేశారు. పతంగులు ఎగురవేయడానికి ఒకరితో ఒకరు పోటీపడ్డారు. ఇళ్లలో సంక్రాంతి పిండి వంటలు ఘుమ ఘుమలాడాయి. వివిధ గ్రామాల్లో బసవన్నల సందడి కనిపించింది. గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో భోగి పర్వదిన వేడుకలు అంబురాన్నంటాయి. అసిస్టెంట్ కమాండెంట్‌లు రఘునాథ్‌చౌహాన్, శరత్‌కుమార్ ఆధ్వర్యంలో భోగి మంటలు వేయగా ఆర్‌ఐలు, ఆర్ఎస్సైలు, బెటాలియన్ సిబ్బంది పాల్గొని భోగి మంటలు కాగారు.



జిల్లా కేంద్రంలో భోగి మంటలు కాగుతూ...



కన్నాలబస్తీలో ముగ్గు వేస్తున్న మహిళలు



ఆస్నాదలో పిల్లలకు భోగి పండ్లు పోస్తూ...

ఘనంగా భీమదేవర జెండా పండుగ

తాండూర్: మండలంలోని భోయపల్లి గ్రామంలో ఆదివారం భక్తి శ్రద్ధలతో భీమదేవర జెండా పండుగను మన్నెవార్, కొలవార్ శ్రేణులు జరుపుకున్నారు. మన్నెవార్‌ల సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా గ్రామ పొలిమేరలో ఉన్న భీమదేవర వరకు శోభాయాత్ర చేపట్టారు. వాయిద్యాల చప్పుళ్ల మధ్య కోళ్లు, మేకలతో చిన్నాపెద్దా అనే తేడా లేకుండా బోనం తీశారు. ఆట పాటలతో భీమదేవర పండుగను మన్నెవార్‌లు నిర్వహించారు. కార్యక్రమంలో మండల నాయకులు గొలిశెట్టి బాపు, మండల ప్రధాన కార్యదర్శి ఎలిగేటి రమేష్, గౌరవ అధ్యక్షుడు భాపు, స్కూల్ చైర్మన్ చంద్రయ్య, ఉద్యోగ సంఘం నాయకులు కనుకయ్య, గ్రామ అధ్యక్షుడు భార్గవ్, ప్రధాన కార్యదర్శి రాంబాబు, మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పూజకు వచ్చిన మన్నెవార్ శ్రేణులు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- ముగ్గుల పోటీల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు
- పోటాపోటీగా పాల్గొన్న యువతులు
- విజేతలకు బహుమతులు ప్రదానం

భీమిని: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరి అన్నారు. మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో ఆదివారం ఎంపీపీ అధ్యక్షతన ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సై ప్రశాంత్ హాజరై మాట్లాడారు. సంక్రాంతిని పురస్కరించుకొని నిర్వహించిన ఈ పోటీల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొనడం సంతోషకరమన్నారు. గెలుపు, ఓటములు సర్వసాధారణమని, ఓడినవారు బాధపడకుండా మళ్లీ గెలిచేందుకు ప్రయత్నించాలన్నారు. ప్రథమ బహుమతి చంద్రగిరి భవాని, ద్వితీయ బహుమతి స్నేహ, తృతీయ బహుమతి మల్లీశ్వరి గెలుచుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నారాయణ, నాయకులు పోతురాజుల లక్ష్మణ్, బండి శివాని, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు ఆధ్వర్యంలో...

దండేపల్లి: మండలంలోని తాళ్లపేటలో మాలమహానాడు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు లక్సెట్టిపేట సీఐ కృష్ణ బహుమతులు ప్రదానం చేశారు. ఉపసర్పంచ్ తిరుపతి, కాంగ్రెస్ నాయకులు రాజేందర్, సతీష్, దయాకర్, తాళ్లపేట యూత్ అధ్యక్షుడు రవి, సభ్యులు కిరణ్, నవీన్, రాజేందర్, మున్నీ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో...

దండేపల్లి: మండలంలోని నాగసముద్రం, చెలకగూడ గ్రామాల్లో బీజేపీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ పరిశీలించారు. అందంగా ముగ్గులు వేసిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. పార్టీ మండల మహిళ అధ్యక్షురాలు నందుర్క సుగుణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నార్వాయిపేటలో...

నెన్నెల: మండలంలోని నార్వాయిపేటలో కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు లావుడియా రమేష్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నేతరి స్వామి ముఖ్య అతిథిగా పాల్గొని పోటీల్లో గెలుపొందిన యువతులు, మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గొల్లపల్లి, గుండ్ల సోమారం ఎంపీటీసీలు హరీష్‌గౌడ్, దాగం రమేష్, నాయకులు కిషన్‌రెడ్డి, తోట శ్రీనివాస్, గట్టు బానేష్, శ్రీకాంత్ నానయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆదిల్‌పేట్‌లో...

మందమర్రిరూరల్: మండలంలోని ఆదిల్‌పేట్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. బాలికలు, యువతులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని ముగ్గులు వేశారు. బి.రజిత మొదటి, ఏ.మౌనిక రెండో, బి.భవాని మూడో బహుమతి సాధించగా, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి బహుమతులు ప్రదానం చేశారు. సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చిర్రకుంట సర్పంచ్ ఒడ్నాల కొమురయ్య, ఆదిల్‌పేట్ సర్పంచ్ పున్నం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాంచందర్, మండల అధ్యక్షుడు నీలయ్య, మాజీ అధ్యక్షుడు జీవన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

దొనబండలో...

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో స్థానిక మహిళలు, యువతులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు సందెరాజుల వెంకటస్వామి, రేవెల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించగా పలువురు ఉత్సాహంగా పాల్గొని అందమైన రంగురంగుల ముగ్గులు వేసి ప్రత్యేకంగా ఆకర్షించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన మొదటి విజేత రేవెల్లి నిహారికకు రూ.2వేలు, రెండో విజేత మేకల లహరికి రూ.1,500, మూడో విజేత గూడెల్లి అనూషకు రూ.1000 నగదు ప్రోత్సాహం అందించగా పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. సర్పంచ్ జాడి సత్యం, వైస్ ఎంపీపీ రమాదేవి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు తనుగుల సత్యాగౌడ్, యువత అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యక్షుడు పిట్టల గోపాల్, స్థానికులు పాల్గొన్నారు.



నాగసముద్రంలో ముగ్గులు పరిశీలిస్తున్న రఘునాథ్



నెన్నెల: బహుమతి అందజేస్తున్న స్వామి



దొనబండలో ముగ్గులు వేస్తున్న యువతులు



దండేపల్లి: విజేతకు బహుమతి అందజేస్తున్న సీఐ



మందమర్రిరూరల్: విజేతను అభినందిస్తూ..



భీమిని: లక్ష్మీపూర్‌లో విజేతలకు బహుమతులు

వాలీబాల్ టోర్నీ విజేత లంబాడితండా

కాసిపేట: మండలంలోని దేవాపూర్ నాయకపుగూడలో నిర్వహించిన రొడ్డ చిన్న రమేష్ స్మారక మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో లంబాడితండా జట్టు గెలుపొంది మొదటి స్థానంలో నిలిచింది. లంబాడితండా(డి), రాంపూర్ జట్టు ఫైనల్లో పోటీపడగా హోరాహోరీగా సాగిన పోటీలో లంబాడితండా మొదటిస్థానంలో, రాంపూర్ ద్వితీయ స్థానంలో, తిర్యాణి జట్టు మూడో స్థానంలో నిలవగా ఎంపీపీ రొడ్డ లక్ష్మి వారికి నగదు బహుమతులు, షీల్డ్‌లు అందించారు. కార్యక్రమంలో దేవాపూర్, మద్దిమాడ, రొట్టెపల్లి సర్పంచులు తిరుమల అనంతరావు, ఆడ జంగు, పెంద్రం హన్మంతు, ఆదివాసీ నాయక్‌పోడ్ సేవాసంఘం రాష్ట్ర నాయకుడు కొమ్ముల బాపు, నాయకులు పల్లె మల్లయ్య, వెడ్మ కిషన్, సంద్ర భూమయ్య, బద్ది శ్రీనివాస్ తదితరులున్నారు.

కోణంపేటలో వాలీబాల్ టోర్నమెంట్

నెన్నెల: మండలంలోని కోణంపేటలో సంక్రాంతి పండుగ సందర్భంగా యువత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ మండల స్థాయి టోర్నమెంట్‌ను ఆదివారం బీసీ మహిళా సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు, ఉపాధ్యాయురాలు ఎర్ర సువర్ణ, సర్పంచ్ తిరుపతిరెడ్డితో కలిసి ప్రారంభించారు. కంకణాల వెంకన్న జ్ఞాపకార్థంగా కుటుంబ సభ్యులు నారాయణరెడ్డి, తిరుపతిరెడ్డి, మొండన్నలు క్రీడాకారులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో నిర్వాహకులు సునార్కరి శంకర్, కాంగ్రెస్ నాయకులు తోడె బాపురెడ్డి పాల్గొన్నారు.



కాసిపేట: బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ



పోటీలు ప్రారంభిస్తున్న ఎర్ర సువర్ణ